క్లుప్తంగా

కరాటే పోటీల్లో సత్తా

మదనపల్లె సిటీ : కర్నూలులో జరిగిన 12వ నేషనల్ లెవల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అశ్విన్ గోల్డ్‌మెడల్, సహస్ర సిల్వర్, దుష్యంత్ వెంకట్ గోల్డ్‌మెడల్, పునీత్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు ఎం.ఎ.సతీష్ తెలిపారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు రెండువేల మంది పాల్గొన్నారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం యోధా అకాడమీలో అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఆగస్టీన్ పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ

ములకలచెరువు : ములకలచెరువు కేజీబీవీ పాఠశాల బాలికలు తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏషియన్ తైక్వాండో పోటీల్లో 9 గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ స్వాధీనం చేసుకున్నట్లు పీఈటీ రేష్మా తెలిపారు. గెలుపొందిన బాలికలకు పాఠశాల సిబ్బంది అభినందించారు.

డీలర్లకు ఈ-పాస్ మిషన్లు పంపిణీ

పీలేరు రూరల్ : మండలంలోని చౌకదుకాణాల డీలర్లకు కొత్త ఈ-పాస్ మిషన్లను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయర్స్ డీటీ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 56 చౌకదుకాణాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ నిత్యావసర సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. పాత మిషన్లు తీసుకుని వాటి స్థానంలో 56 కొత్త ఈ-పాస్ మిషన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

రిషివాటికలో డీఎస్పీ విచారణ

బి.కొత్తకోట : మండలంలోని రిషివాటిక గురుకులంలో మంగళవారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర విచారణ జరిపారని పోలీసులు తెలిపారు. ఇక్కడ చదువుకుంటున్న లక్కిరెడ్డిపల్లె మండలం కాలాడివాండ్లపల్లెకు చెందిన విద్యార్థి కే.శేషాద్రిరెడ్డి (11)ని రాయితో కొట్టిన ఘటనలో కుడికన్ను చూపు కోల్పోవడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డీఎస్పీ మహేంద్ర, ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు రిషివాటికి వెళ్లి అక్కడ విచారణ ప్రారంభించారు. శేషాద్రిరెడ్డికి రాయి ఎలా తగిలింది, ఎవరు కొట్టారు. గాయమైన తర్వాత పరిస్థితులపై విచారించారు. దీనిపై బి.కొత్తకోట మండలానికి చెందిన ఓ విద్యార్థిని డీఎస్పీ గోప్యంగా విచారణ చేశారని పోలీసులు తెలిపారు. కాగా శేషాద్రిరెడ్డి కుడి కన్ను చూపు పూర్తిగా కోల్పోవడంతో కేసుకు సంబంధించి దర్యాప్తు మొదలైంది.

మహిళకు తీవ్రగాయాలు

కలకడ : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. మంగళవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ ఎస్టీకాలనీ వద్ద ఎస్టీ కాలనీకి చెందిన శెట్టిపల్లె జయమ్మ పొలం వద్దకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయమ్మను వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

జెడ్పీ నిధులతో తాగునీటి బోరు

రామసముద్రం : జెడ్పీ నిధులతో ఆర్. నడింపల్లి పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లి గ్రామంలో తాగునీటి బోరు వేశారు. బోరులో నీరు పుష్కలంగా ఉండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన తన గ్రాంటులో రూ.3 లక్షల నిధులు మంజూరు చేసి నూతనంగా తాగునీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సమతుల ఆహారం.. సంపూర్ణ ఆరోగ్యం

- వ్యాధుల కాలంలో ఆరోగ్య నియమాలు తప్పనిసరి
- తాజా పండ్లు, ఆకుకూరల వినియోగంతో రోగ నిరోధక శక్తి
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం



మదనపల్లె సిటీ : ప్రస్తుతం విష జ్వరాలతో పాటు ఇతర జబ్బులతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆరోగ్య నియమాలు ఎంతో ముఖ్యం. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహార అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండటం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరవుతాయి. ఎక్కువగా కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి. వీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు. ఆహారంలో శనగగింజలు, మినుములు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్లు, వారంలో ఒకసారి చికెన్, మటన్, చేపలు వంటివి స్వల్పంగా తినాలి. భోజనానికి ముందు తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. రోజువారి ఆహారంలో తాజా కూరలు, కూరగాయాలు, పండ్లు ఉండేలా చేసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మపోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్‌రూపంలో కూడా తీసుకోవచ్చు.

రోజువారీ ఆహారం ఇలా..

ఉదయం మూడు ఇడ్లీలు, లేదా 60 గ్రాముల గింజల ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు,150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటలకు పండ్ల రసం తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు తీసుకోవాలి.

మంచి ఆహారంతో ఆరోగ్యం



ఆహారం బాగా ఉడికించి తినాలి. ఆహారంలో విటమిన్లు కలిగిన వాటిని తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరటోన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపా విటమిన్లు అందుతాయి.

- డాక్టర్ వెంకట్, వైద్యాధికారి

స్వామిత్వను పకడ్బందీగా అమలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి



కోన గ్రామంలో స్వామిత్వ సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

కలకడ : స్వామిత్వ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కోన పంచాయతీలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు.

ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల సర్వే పూర్తిచేశారు? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్ణీతకాలంలో సర్వేను పూర్తిచేసి ఇళ్ల యాజమానులకు యాజమాన్య హక్కులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని కదిరాయచెర్వు సచివాలయాన్ని తనిఖీ చేసి చెత్తసేకరణ వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రజలందరికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేకుండా స్వామిత్వ సర్వే చేయాలి

కలకడ : మండలంలో స్వామిత్వ సర్వేను తప్పులు లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి నిర్వహించాలని రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మిపతి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌లతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వమిత్వ సర్వేపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటి, హద్దులు, యజమానులు తెలియజేసే వివరాలు నమోదు చేసి వారి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతోపాటు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను జతచేయాలని గుర్తు చేశారు. స్వామిత్వ సర్వే పూర్తి చేసిన అనంతరం వారికి హక్కుపత్రం మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడదాం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



నాయకులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడదామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లెలో మాజీ ఎమ్మెల్యే పర్యటించారు. కొత్తపల్లెకు చెందిన మాజీ రిపోర్టర్ శ్రీనివాసులు రెడ్డి తల్లి నారాయణమ్మ మృతి చెందడంతో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్యారంపల్లె, తీతవగుంటపల్లె, మఠంపల్లె గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులను కలసి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇష్టానుసారం ప్రజలకు ఉచిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అన్ని వర్గాల ప్రజలతోపాటు ఉద్యోగ ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, నాయకులు డాబా బాబు, దండు వెంకటరమణారెడ్డి, రెడ్డిశంకర్‌రెడ్డి, అడవిపల్లె రాజన్న, వెంకటరమణనాయుడు, పి. ద్వారకనాథరెడ్డి, బాలకృష్ణ, రవిచంద్రారెడ్డి, రవి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

గుర్రంకొండ : క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గుర్రంకొండలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. స్థానిక ఉర్దూ జెడ్పీ స్కూల్లో నిర్వహించిన ఈ ఆటలపోటీల్లో మండలస్థాయిలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్, 100,200 మీటర్స్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కత్రో, జావలిన్‌త్రో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలు డివిజన్ స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని పీడీ వెంకటేశ్వర్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని తద్వారా వారి ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సైదా సుల్తానా, పీడీలు జోష్న, ఆనందరెడ్డి, శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో రోజులుగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. కోకో అండర్-14, 17లో రంగసముద్రం హైస్కూల్‌కు చెందిన బాల, బాలికలు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీలో మోడల్, స్థానిక తెలుగు హైస్కూల్ విద్యార్థులు, వాలీబాల్‌లో కందుకూరు, పీటీఎం విద్యార్థులు ప్రతిభ చాటగా వీరంతా డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, పీడీ జవహర్, హెచ్ఎం వేమనారి తెలిపారు.

ఆటలతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : ఆటలతోనే విద్యార్థులకు ఆరోగ్యం, పట్టుదల వస్తుందని ఎంఈఓ నాగసుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం మోడల్ స్కూల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. అండర్-14,-17 బాల, బాలికలకు 400 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కత్రోలలో పోటీలు జరిగాయి. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీలు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్ అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో భాష్యం, వశిష్ఠ, జెడ్పీ ఉన్నత పాఠశాల,సీటీఎంలు విజేతలుగా నిలిచాయి. యోగా అండర్-14 బాలుర విభాగంలో కె.చరణ్‌తేజ్,నిఖిల్ జెడ్పీ ఉన్నత పాఠశాల మదనపల్లె మొదటి స్థానం, కె.సత్యవర్ధన్‌నాయక్ నవ్యచైతన్య స్కూలు రెండవ స్థానం నిలిచారు. అండర్-14 బాలికల విభాగంలో జి.మధులత, వెలుగు మొదటి స్థానం, ఎ.ఎస్‌అనుషా మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయస్థానం, పి.సోఫియా తృతీయస్థానం, కైవసం చేసుకున్నారు. అండర్-17 బాలికల విభాగంలో ఎస్ సౌమ్య,వెలుగు స్కూలు మొదటి స్థానం, ఆర్.లక్ష్మిప్రసన్న జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో సాయి క్రిష్ణ, జెడ్పీ ఉన్నత పాఠశాల మదనపల్లె మొదటి స్థానం, ఎస్.మునిచంద్రరాజు జ్ఞానోదయ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, పీడీలు సుధాకర్, దేవకమ్మ, జలజ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న కురవంక పంచాయతీ వార్డు మెంబర్లు

మదనపల్లె రూరల్ : కురవంక పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని, జరగలేదంటున్న టీడీపీ నాయకులు ఆధారాలతో వస్తే బహిరంగ చర్చకు సిద్ధమని వార్డు మెంబర్లు సవాల్ విసిరారు. కురవంక పంచాయతీలో నిధులు గోల్‌మాల్ జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తూ ఎంపీడీఓకు వినతిపత్రం అందించడంపై కురవంక పంచాయతీ వార్డు మెంబర్లు స్పందించారు. ఈ సందర్భంగా ఐటీయూసీ నాయకులు, వార్డు మెంబర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ కురవంక టీడీపీ ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న వినోద్, తన తండ్రి బినామీ సర్పంచ్‌ను అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా పంచాయతీ సొమ్మును బొక్కేసిన చరిత్ర తెలుసుకోవాలన్నారు. రెండు పంచాయతీలు ఒకటిగా ఉన్నప్పుడు కార్మికుల పేరు చెప్పి డబ్బులు కొట్టేసిన ఘనచరిత్ర టీడీపీ నాయకులదేనన్నారు. మదనపల్లె మండలంలో 25 పంచాయతీలు ఉంటే, అందులో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ క్రమం తప్పకుండా చెల్లిస్తూ, వారి సంక్షేమానికి కృషిచేస్తోంది కురవంక పంచాయతీ మాత్రమేనని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు మంజూరు చేయమని సెక్రటరీ మంజులను కోరితే, దానికి ఆమె నిరాకరించిందని ఎంపీడీఓకు ఫిర్యాదుచేస్తే, బంధువని ఆమెను వెనకేసుకురావడం తగదన్నారు. సొంతనిధులతో రోడ్లు, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన ఘనత సర్పంచ్ చలపతికే దక్కిందన్నారు. నూతనంగా ఏర్పాటైన కురవంక పంచాయతీలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అభివృద్ధి పనులు చేస్తూ, మంచిపేరు తెచ్చుకున్న సర్పంచ్ చలపతిపై అభియోగాలు మోపడం సరికాదని హితవుపలికారు. టీడీపీ నాయకుడు వినోద్ తక్షణమే సర్పంచ్ చలపతికి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు నాగరాజు, చంద్రకళ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాల సర్వేకు సహకరించండి

మదనపల్లె రూరల్ : కులధ్రువీకరణ పత్రాలను అక్టోబర్ 2 నుంచి ఇంటివద్దనే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, మండలంలో వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారని, దీనికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాలను ఇంటివద్దకే అందించేందుకు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేలో ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్హతల సర్టిఫికేట్లు, పాత కులధ్రువీకరణ పత్రం తదితర వివరాలను పరిశీలిస్తామన్నారు. ప్రజలు గతంలో మాదిరిగా కులధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మదనపల్లె మండలంలో 47,000 మందికి సంబంధించి కులధ్రువీకరణ పత్రాలకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 15లోపు సర్వే పూర్తిచేసి, అక్టోబర్ 2 నుంచి ఇంటివద్దకే కులధ్రువీకరణ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు.


అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

తంబళ్లపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. కన్నెమడుగు ఎంపీటీసీ సభ్యుడు మహేష్ మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా ప్రజాప్రతిధులకు సమాచారం ఇవ్వాలని ప్రొటోకాల్ తప్పక పాటించాలని ఎంపీడీఓ థామస్‌ను నిలదీశారు. తాను కొత్తగా వచ్చానని ఇప్పటి నుంచి తప్పక ప్రొటోకాల్ పాటిస్తూ అన్ని విషయాలను ప్రజాప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సొంత నిధులతో పనులు పూర్తి చేశామని వాటికి బిల్లులు చెల్లించాలని కోరారు. పనులను పరిశీలించి తప్పకుండా బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. కోసువారిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ, మర్రిమాకులపల్లె సర్పంచు కె.జ్యోతి పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం పలు శాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. పలుశాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. గైర్హాజరైన వారికి మెమోలు ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరతో టమాటా కొనుగోలు చేయండి

ములకలచెరువు : వివిధ ప్రాంతాల నుంచి ములకలచెరువు టమాట మార్కెట్‌కు వచ్చే టమాటాలను నాణ్యతను చూసి అధిక ధరలతో కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు మార్కెట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి కోరారు. మంగళవారం మార్కెట్‌యార్డులో బయటి రాష్ట్రాల వ్యాపారస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. నాణ్యతనుబట్టి కాయలు కొనుగోలు చేయాలని, రైతులకు నష్టాల నుంచి కోలుకునేలా విక్రయాలు జరగాలని ఈ సందర్భంగా వ్యాపారస్తులకు సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ

రామసముద్రం : విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని మదనపల్లి రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రామసముద్రం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మార్గదర్శకాలు సూచించారు. విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించి మంచిస్థాయి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలన్నారు. మంచి చెడులను గ్రహించి, చెడు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో గాడి తప్పితే జీవితం పాడవుతుందని, పెద్దలు, టీచర్లు చెప్పిన మాటలు, సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామసముద్రం ఎస్ఐ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21 మంది బైండోవర్

రామసముద్రం: రామసముద్రంలోని గాజులనగర్‌లో సోమవారం ఇరువర్గాలు గొడవపడిన కేసులో 21మందిపై కేసు నమోదు చేశారు. మంగళవారం వీరిని బైండోవర్ చేస్తూ రామసముద్రం తహసీల్దార్ అజారుద్దీన్ ఎదుట హాజరుపరిచారు. నిందితులకు షరతులతో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు రమేష్, మహమ్మద్‌బేగ్ విద్యార్థులకు వ్యాసరచన, కథలు, కవితలు, డ్రామాలు పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకృష్ణదేవరాయల డ్రామా ఆసక్తికరంగా చేశారు. హిందీ పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ భాష హిందీలో మాట్లాడే విధంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్‌నాయక్, బాలకృష్ణనాయుడు, భారతి, సుజాత, సురేంద్ర, ప్రమీల, కృపానందం, పీడీలు నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారు'

పీలేరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదన్నర కాలంలో పెండింగ్‌లో ఉన్న రూ. 2,500 వేల కోట్లు ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ మానసపుత్రిక ఆరోగ్యశ్రీ పథకం పేదలకు పునర్జన్మలాగా పని చేసిందన్నారు. ఇంతటి మహత్తర పథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

జీతాలు చెల్లించాలని వినతి

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 121 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా, ప్రస్తుతం 114 మంది పని చేస్తున్నారని, 46 మందికి ఎండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. సుమారు రూ. 11 లక్షలు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు.

ఉమాదేవి మృతి తీరనిలోటు

కురబలకోట : కురబలకోట మండలంలోని కడప క్రాస్ గ్రామంలోని అడవిపల్లికి చెందిన ఎస్. ఉమాదేవి ఆకస్మిక మృతి కుటుంబీకులను, బంధుమిత్రులను కలచివేస్తోంది. కోలాటంకళాకారిణిగా గుర్తింపు పొందారు.

జీవ కోటి రక్షణ కవచం ఓజోన్

కురబలకోట : జీవ కోటికి ఓజోన్ పొర రక్షణ కవచంగా ఉందని అంగళ్లలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ అసోషియేట్ డీన్‌ఆర్‌అండ్‌డీ డాక్టర్ శివయ్య తెలిపారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం వల్ల ఓజోన్ పొర క్రమంగా క్షీణిస్తోందన్నారు. భూతాపం పెరిగినా వర్షాలు కురవకపోయినా అడవులు తగ్గిపోయినా కాలుష్యం ఎక్కువైనా ఓజోన్ పొర దెబ్బతింటుందని పేర్కొన్నారు.



